

## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి!
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్ద నిశీథిలో
ప్రతిధ్వనించాలి! ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి! ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞానసౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!' అని
అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీ సాయినాధుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించటమే మనం చేయగలిగింది, చేయవలసింది.

--- శ్రీ బాబూజీ

## గురులీలలు - గురుకృప పుటలు


| | | | |
|---|---|---|---|
| 1. సాయివంటి దైవంబు లేడోయి! లేడోయి! | శ్రీ బాబూజీ | ............... | 2 |
| 2. ఉన్నమాట - అనుకున్న మాట | గురుబంధువులు | ............... | 3 |
| 3. మహారాజుగారి రియల్ రికమండేషన్ | సిద్ధార్థ | ............... | 5 |
| 4. పాదాలచెంత సుమాలు - సద్గురు అనుగ్రహ కుసుమాలు | సుస్మిత | ............... | 7 |
| 5. విద్యాభవన్ - అనుగ్రహపవన్ | గౌతమ్ | ............... | 8 |
| 6. హమారే మాలిక్ - శ్రీ బాబూజీ | సుబ్రమణ్యం | ............... | 9 |
| 7. పంచాంగాల పట్టు - అనుగ్రహంతో ఒక 'పట్టు' పట్టు | సత్యనారాయణ | .............. | 11 |
| 8. చిరునీడ - చిరునామా | గురుకృప | ............... | 13 |
| 9. పొత్తిళ్ళు అమ్మవి - రక్షణ శ్రీబాబూజీది | వినయ్‌సాగర్ | ............... | 14 |
| 10. రసస్పందన | గురుకృప | ............... | 15 |
| 11. నవ్యజీవనం - నవవసంతం | గురుకృప | ............... | 19 |



సంపుటి : 9
సంచిక : 1
త్రైమాసిక పత్రిక
జనవరి 2006

నిర్వహణ
గురూజీ
ఆశీస్సులతో
గురుబంధువులు

చిరునామా
గురుకృప
2-1-6
గాంధీచౌక్
తెనాలి - 01

☎
08644
227194 (O)

ముద్రణ
రామకృష్ణ ప్రింటర్స్
విశాఖపట్నం
ఫోన్స్ : 2798072,
2740222

శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహారాజ్‌కీ జై !
సద్గురు శ్రీ సాయినాథుని శరద్బాబూజీకీ జై !

# గురుకృప

## అంతటా తానే - అన్నిటా తానే - ఆనందమే తానని

'**ఆ**నందం' యొక్క రుచి ఎంత? ఇంత బాగుంటుందని తెలిస్తే, ఎవరూ దాన్ని వదిలిపెట్టరు. దానికోసం ఎంతటి కష్టాన్నైనా చాలా ఆనందంగా భరిస్తారు. మరెంతటి ఓర్పునైనా అలవరచుకుంటారు. ఇష్టాఇష్టాలకు తావివ్వరు. సద్గురువు చూపిన బాటన నడిచి గమ్యాన్ని చేరుకుంటారు. ఇంత చెప్పుకున్నాం, బాగానే ఉంది. ఇంతకీ ఏమిటా 'ఆనందం' – ఆనందం అంటే అనుభూతికే అందేది, మాటలకందనిది.

'ఆనందం' వెల్లువెత్తిన వేళ వెతలను తొలగించి, వెలుతులను నింపి వెలుగు మార్గాన మనలను పయనింపచేసే 'దైవం' మానుషరూపేణా సద్గురువుగా సాయి నామ సంకీర్తనలో పాల్గొనడానికి శిరిడీలోని గురుచరణ్ ప్రాంగణంలో దర్శనమిచ్చింది. ఆహా! జన్మ చరితార్థమయింది కదా! 'ఆనందా'నికి అర్థం ఇంత అందంగా తెలియడం మహదానందంగా ఉంది కదా! పూర్వజన్మ ఋణానుబంధ కారణంగా ఈ జన్మలో సద్గురు చెంతన చేరి 'సాయిబాబా' నామస్మరణ చేయడం మొదలెట్టాము. బాబూజీ వంటి ప్రేమమూర్తి తన బిడ్డలందరిని చేరదీసి లాలించి, అవసరమైనవన్నీ ఇచ్చి, అలసిన క్షణాన ఒడిన చేర్చుకొని సేదదీరుస్తున్నారు.

ఈ పరి 'విజయదశమి' గురుదేవుల సంకల్పంలో అంతా ఆనందమయం – సాయిబాబా, బాబూజీల గూర్చి ముద్దులొలికే చిన్నారుల చిట్టి చిట్టి పలుకులు, ఆటలు, పాటలు మధురం, సాయి నామ సంకీర్తన సుమధురం, జీవితమనే పూలతోటలో గురుకృపతో నూతన సుమాలు పూయించుకోవడానికి గురుదేవుల చెంత చేరి, సాయినామాన్ని వేదమంత్రాలుగా, సద్గురు అనుగ్రహ వీక్షణాలు అక్షతలుగా, అతి సమీప







బంధువులైన గురుబంధువుల ఆశీస్సుల మధ్య నూతన దంపతులైన నిండు మనసులు, వారి కనులలో ఆనందం, ఇక ఆ క్షణాలు మధురాతి మధురం. సాయి పల్లకీ ఉత్సవం నయనానందకరం. సద్గురు దేవుల గూర్చిన ఈ చిన్న సంభాషణ ఇద్దరు గురుబంధువులు మాట్లాడుకొనగా విన్నది – 'ఎన్నో వత్సరాలుగా నేను గురుదేవుల వద్దకు వస్తున్నాను. రోజు రోజుకి గురుదేవుల వద్దకు వస్తున్న వారి సంఖ్య అపరిమితమైపోతుంది. దర్శనానికి కూడా ఇబ్బంది అవుతోంది' – అంటూ వాపోయారు ఒక గురుబంధువు, ఒక్క క్షణం ఆలోచించి రెండో గురుబంధువు 'నాకు మాత్రం ఇందులో ఆశ్చర్యం ఏమీ లేదండీ! గురువుగారు చెప్పినట్లు 'తాను శ్రేయోదాయకమని నమ్మిన మార్గంలో తన సాటివారు కూడా పయనించాలని కోరుకోవడం మానవనైజం' – అందునా ఋణానుబంధరూపులైన వారందరూ స్వామి చెంతకు చేరవలసిందే! నాకైతే ఇప్పుడు ఇంకా ఆనందంగా ఉంది. ఎందుకంటే మనం దర్శించుకుని పరమానందభరితులమయ్యే సద్గురు స్వరూపం ఇప్పుడు ఇన్నివేల రూపాల్లో మనచుట్టూ చరిస్తూ, సంచరిస్తూ అనుక్షణం గమనిస్తోంది. గురుబంధువనే మిషగా గురువును గురుతుకి తెస్తుంది. ఈ జీవులన్నిటా తానై, ఈ సృష్టి అంతటా తానైన సద్గురు స్వరూపం ఒక్కసారిగా దర్శనమిస్తోంది'. అని అనగానే, మొదటి గురుబంధువు 'నాది పొరపాటేనండీ! సాయిమాయి చెంతకు చేరిన జీవులు ఎన్నో, ఏనాడైనా ఏ బిడ్డకైనా కష్టం కలిగిందా! ఇక్కడ 'బాబూజీ' అనే సద్గురు మాయి కూడా అంతే, అంటూ ఆనందించాడు. అవధులు లేని ఆనందాన్ని అందంగా అందించడానికే ఆ ప్రేమమూర్తి ఉన్నది. **"ఆనందమే జీవన విధానం, అనుక్షణం ఆనందమే వారి సన్నిధానం, దుఃఖమింకలేదు దాసులకు, సద్గురు చరణదాసులకు!"**

ముద్దులొలికే పాపాయిల నుంచి, ముదిమి పైబడ్డ ముసలి వారి వరకు ఎవరి ముఖంలో చూసినా ఆనందమే. 'గురువుగారు ఈ రోజు చాలా అందంగా కన్పించారంటు' ఒకరి కళ్ళల్లో ఆ మెరుపు, 'ఈ రోజు నావైపు ఎందుకో అలాగే చూశారండీ' అంటూ ఒకరి ముఖంలో ఆలోచనా సుమం, 'ఇంతమందిలోనూ నేను తెచ్చిన బాబా చిత్రపటాన్ని తాకారంటూ' వారి స్పర్శను స్మరించుకుంటూ సంతోషం, ఇంతలో ఒక చిన్నపాప వచ్చి 'అంకుల్! గురువుగారు నా తలనిమిరారంటూ' – చిన్న పాపకు పెద్ద కానుక, 'చాలా కాలం వేచాను, చూడవచ్చాను, తృప్తిచెందాను' అంటూ ఒక బామ్మగారి కళ్ళలో ఆనందభాష్పాలు. స్వామీ! ఒక్కటే రూపం, కానీ ఇదా మీ ఆనంద స్వరూపం – ఎందరో, ఎందరెందరో మీ పదసన్నిధిని చేరి పరమానంద భరితులవుతున్నారు. గురుదేవుల దర్శనం జరిగిన తీరును మరో గురుబంధువుతో పంచుకోవడానికి ఫోన్ చేస్తే అంతా విని, 'అయితే ఆనందమనే అల వచ్చి ఒడ్డున ఉన్న



వారందరినీ అలా తాకి వెళ్ళిందన్నమాట' అన్నారు. మురిసిపోయాం ఈ మాటవిని! అయితే ఇంతలోనే ఒక సందేహం! కేవలం 'అల' అలా వచ్చి ఇలా తాకిపోతేనే ఇంతమంది ఆనందిస్తే, అసలు ఆ 'ఆనంద'మనే సముద్రపు సొగసు చూస్తే! అమ్మో! అంతుపట్టలేదు. భవసాగరమన్నారు పెద్దలు, గురుదేవుల చెంతకు చేరినవారు 'భవ్యసాగర'మంటున్నారు, ఇక ఈ జీవితాన చింతలేదిక. పూజ్యగురుదేవుల వద్దకు రావడం, కావాల్సినంత ఆనందాన్ని దండుకోవడం, మనవద్ద 'ఆనందం' నిండుగా ఉండగానే మరల వారిని దర్శించుకోవడం. ఇక ఏర్పాట్లంటారా! బిడ్డలొస్తున్నారంటే లోగిలంతా నిత్య కళ్యాణం – పచ్చతోరణం అన్నట్లు తయారుచేస్తారు కదా వారు! (*His Mission is to give blessings*) ఆశీర్వదించడమే వారి పని. ఆశ్రయించుకుని వారి మాటను ఆచరించి, వారు చూపిన బాటన పయనించడం మన పని.

గురుబంధువులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ, నూతన వత్సరం నవ్య జీవనంగా సాగాలని, సద్గురు అనుగ్రహ ఆశీస్సుల ఎరుక మనందరికీ ఉండాలని ఆకాంక్షిస్తూ... చిన్నారుల సంచికకు వచ్చిన కొందరు చిట్టిపొట్టి చిన్నారుల అనుభవాలను ఈ సంచికలో ప్రచురించడం జరిగిందని సవినయంగా తెలియజేసుకుంటున్నాము.

**- గురుకృప**

# మహారాజు గారి రియల్ రికమండేషన్

నాడు బాబా చరిత్రలోని పాత్రలు, వారి వారి అనుభవాలు, బాబా చేసిన లీలలు చదివి, ఊహించుకొని పులకిస్తాం మనం. అయితే కొన్ని లీలలు చూస్తే నాడు బాబా దగ్గర ఉన్న వ్యక్తులు, బాబా చేసిన లీలలు పునరావృతమవుతున్నాయా? గురుదేవుల వద్ద అని అనిపిస్తుంది. కేవలం పిలిచే పేర్లు మాత్రమే మార్పు, నాడు భక్తులు బాబా అంటే నేడు బాబూజీ అంటున్నారు. ఈ అనుభవం పంపిన చిన్నారి పుట్టుక, వాళ్ళ అమ్మగారికి గురుదేవులు ఇచ్చిన ఒక గొప్ప అనుభవం అయితే, ఈ చిన్నారి విషయంలో దీక్షిత్ కూతురు అనుభవం పునరావృతమయింది. విల్లేపార్లేలోని ఇంట్లో బీరువా దీక్షిత్ కూతురు మీద పడుతుంది. కేవలం గాజులు చిట్లడం మినహా ఏమీ జరుగదు. అలాగే 80 కేజీల బీరువా మీదపడ్డా ఈ చిన్నారి చక్కగా బయట పడ్డాడు. స్కూల్లో సీటు అయినా, స్పోర్ట్స్‌లో మెడల్ అయినా అనుగ్రహం, ఆశీస్సులు అన్నీ నాకు శ్రీ బాబూజీ అందించేవే అంటున్న ఈ చిన్నారి అనుభవంలోకి.....

నా పేరు సిద్దార్థ. నాకు గురువుగారు అంటే చాలా ఇష్టం. నేను గురువుగారి ఆశీస్సులతో పుట్టానంట. నాకు పేరు కూడా గురువుగారే పెట్టారు. అందుకే నా పేరంటే నాకు చాలా





ఇష్టం. నాకు రోజూ చాలా అనుభవాలు జరుగుతుంటాయి. నాకు చెన్నైలోని స్కూలులో సీటు కూడా గురువుగారి బ్లెస్సింగ్స్ వలనే దొరికింది. అది ఎలాగంటే, మా డాడీ స్కూల్ సీటు కోసం అన్ని రికమండేషన్స్ చేయిస్తున్నారు. గురువుగారు ఎవరిని కలవమంటే వాళ్ళను కలిసారు. అయినా ప్రిన్సిపాల్ ఒప్పుకోలేదు. చివరికి డాడీ గురువుగారితో నేను ఎవరి దగ్గరకి వెళ్ళను, సీటు గురించి ఎవరిని అడగను మీరే ఇప్పించాలి అని చెప్పుకున్నారు. మరుసటిరోజు ఉదయం ప్రిన్సిపాల్ ఫోన్‌చేసి మీ బాబుకి సీటు ఇస్తున్నాను, రమ్మని చెప్పారు. అలా కేవలం గురువుగారే సీటు ఇప్పించినట్లు స్పష్టంగా అర్థం అయ్యేలా చేశారు.

మా బాల్కనీలో పెద్ద 80 కేజీల చెక్క బీరువా ఉంది. చిన్న బాల్కనీ. ఆ బీరువాలో ఉన్న స్కేట్స్ తీసుకుందామని వెళ్ళి తలుపుతీసి స్కేట్స్ తీసుకుని క్రింద పెట్టాను. ఆ బీరువా మీదకి పడుతోంది. చెయ్యి పెట్టి ఆపబోయాను. అది ఆగలేదు. వెంటనే వెనక్కి తిరిగాను కానీ స్కేట్స్‌లో కాలు ఇరుక్కుని నేను ముందుకి వెళ్ళడానికి కుదరలేదు. బీరువా తోపుడుకి రూమ్ తలుపు మూసుకుపోయి దానికి వున్న అద్దం పగిలి నామీద పడింది. నామీద బీరువా ఉంది. ఎవరు రావాలన్నా రూమ్ తలుపు మూసుకుపోయింది. మా మమ్మీ ఎలాగో కష్టపడి తలుపునెట్టి అలాగే దూరి వచ్చి బీరువా ఎత్తడానికి చూస్తే లేవలేదు. నన్ను బయటికి లాగితే చాలా ఈజీగా వచ్చేశాను. అంత బరువు ఉన్న బీరువా నామీద పడినా నాకు ఏమీ కాలేదు. కొంచెం ముక్కు వాచింది. డాక్టర్ ఫ్రాక్చర్ అయిందేమో అన్నారు. కానీ ఏమీ అవ్వలేదు. ఇలా గురువుగారు నన్ను రక్షించారు.

నాకు స్కూల్‌లో ఏ ప్రాబ్లెమ్ వచ్చినా బాబా, గురువుగార్లు నన్ను రక్షిస్తూ వుంటారు. నాకు స్పోర్ట్స్‌లో కూడా చాలా మెడల్స్ వచ్చాయి. వాటన్నింటిలో బాబాని గురువుగారిని తలుచుకుంటూ పాల్గొంటాను. వారి అనుగ్రహంతో గెలిచాను. నాకు సైకిల్ కావాలంటే డాడీ కొనడం లేదు. నేను గురువుగారికి చెప్పుకున్నా, తరువాత గురువుగారు డాడీకి కొనమని చెప్పారు. అలా నాకు ఏది కావాలన్నా గురువుగారికి చెప్పుకుంటే నాకు అవి ఇప్పించేవారు. నేను రోజూ స్కూలుకి వెళ్ళేముందు నిత్యప్రార్థన చదువుకుని, బాబాకు చెప్పుకుని వెళ్తాను.

**- అద్దంకి సిద్దార్థ**, చెన్నై

**గురుబంధువులు తమ అనుభవాల్ని Internet ద్వారా పంపడానికి**
**leelas@guruji.org కి mail చేయగలరు.**
**ఇంటర్‌నెట్‌లో "గురుకృప" - Visit : www.guruji.org**





## పాదాల చెంత సుమాలు - సద్గురు అనుగ్రహ కుసుమాలు

'గురుకృప' పత్రికలో గురువుగారితో గురుబంధువులకున్న అనుభవాలు చాలా వస్తున్నాయి కదా! బాగా వున్నాయి. తరచి చూస్తే చరిత్ర మరల బాబూజీ రూపంలో పునరావృతం అవుతోందనిపిస్తోంది. దాసగణు కీర్తనలో బాబాను చూసి లాలా లక్ష్మీచంద్ శిరిడీ బయలుదేరాడు. కోపర్‌గామ్ వద్ద జామపండ్లు కొందామని, బాబాకు సమర్పిద్దామని ఆశిస్తాడు లక్ష్మీచంద్. ప్రకృతి పరవశంలో ఈ విషయాన్ని మరచిన లక్ష్మీచంద్ వద్దకు జామపండ్లను పంపుతారు బాబా ఆనాటి అనుభవంలో. ఇక్కడ కొంచెం మార్పు. జామపండ్ల స్థానే మల్లెలు. అవి ఇచ్చింది ఎవరో అనుభవం చదివితే.....

మేము 2004 వేసవి సెలవుల్లో శిరిడీ వెళ్ళాము. అప్పుడు ఊరికి వెళ్ళేవారికి గురువుగారి పాదదర్శనం అవకాశం ఉంది. ఆరోజు మేము గురువుగారి పాదదర్శనం చేసుకోవాల్సి వస్తుంది. దర్శనం మొదలయ్యింది. చాలా క్యూ ఉంది. అప్పుడు నేను, రమ్య గురువుగారి దగ్గరకు ఒట్టి చేతులతో కాకుండా ఏమయినా తీసుకువెళదాం అనుకున్నాము. రమ్య బిస్కెట్ ప్యాకెట్ అంటే, నేను వద్దని పూలు తీసుకువెళదాం, పాదాలవద్ద ఉంచుదాం అన్నాను. నాకు మనస్సులో మల్లెపూలు తీసుకువెళ్ళి గురువుగారి పాదాలవద్ద ఉంచుదామని కోరిక. అలా నేను, రమ్య పూలు కొందామని త్వరత్వరగా మందిరం వద్దకు వెళ్ళాము. అక్కడ మల్లెపూలు దొరకలేదు. అలా వెతుకుతూ, వెతుకుతూ బస్టాండ్ వరకు వెళ్ళినా మల్లెపూలు దొరకలేదు. ఇక తిరిగి వస్తుంటే గురుస్థాన్ వద్ద అంగడిలో గులాబీ పూలు కొని పరిగెత్తుతూ సాయిపథం చేరి, క్యూలో నుంచున్నాము. నేను ఎప్పుడు గురువుగారి దర్శనానికి వెళ్ళినా నా ముందు, వెనుక ఎవ్వరూ లేకుండా ఉన్నప్పుడు దర్శనం చేసుకుంటే బావుండునని అనిపిస్తుంది. కాని అది చాలా కష్టం కదా! అలా క్యూలో నేను, రమ్య, డా॥ రాజశేఖర్ ఉన్నాము. మా వెనుక చాలామంది గురుస్థాన్‌లో ఉన్నారు. నేను వాళ్ళిద్దరి వెనుకకు జరిగి పగోడా ద్వారం బయట నుంచొని ఉన్నాను. అప్పుడు నరేంద్రగారు వచ్చి గురుస్థాన్ వద్దవున్న తలుపు గడిపెట్టారు. కారణం దర్శనంలో కొంతసేపు విరామం. అంటే మా వెనుక ఎవరూ లేరు. ఇక రమ్య, డా॥ రాజశేఖర్ దర్శనం చేసుకొని వెళ్ళిపోయారు. ఇక మిగిలింది నేనొక్కదానినే. నా ముందు ఎవరూ లేరు, నా వెనుకా ఎవరూ లేరు.

నెమ్మదిగా గురువుగారి వద్దకు వెళ్ళి, పూలు వారి పాదాలవద్ద ఉంచి నమస్కారం చేసుకుని, ఊదీ ప్రసాదం తీసుకుని వెనుకకు వచ్చి నుంచున్నాను. గురువుగారు ఆసనం నుండి లేస్తూ నన్ను చూసి దగ్గరకు రమ్మని సైగ చేశారు. ఉలిక్కిపడి దగ్గరకు వెళ్ళాను. తన ప్రక్కనున్న





సన్నజాజిపూల మాలను తీసి నా చేతిలో పెట్టి లోపలికి వెళ్ళిపోయారు. నాకు ఒకప్రక్క ఆశ్చర్యం, మరోప్రక్క ఆనందం. కళ్ళవెంట కారుతున్న ఆనందాశ్రువులను తుడుచుకుంటూ – ఆహా **ఏమి నా భాగ్యము!** అనుకుంటూ బయటకు వచ్చాను.

దర్శనం తరువాత గురువుగారు 'సాయిపథం' నుండి 'గురుచరణ్'కు వెళ్ళేటప్పుడు దర్శనం చేసుకుందామని ఆ దారిలో నుంచొని ఉన్నాను. అప్పుడు గురువుగారు ఇచ్చిన పూలమాలను తలలో పెట్టుకున్నాను. నా పక్కనున్న ఆంటీ 'నువ్వు పెట్టుకున్న జాజిపూలమాలలో కొన్ని మల్లెలు కూడా ఉన్నాయి గమనించావా?' అన్నారు. తీరా చూస్తే అందులో మల్లెలు ఉన్నాయి. ఒక్క నిముషం వాటిని చూసి అవాక్కయ్యాను. ఆయన పాదాల వద్ద మల్లెలు ఉంచాలన్న నా తపన, కోరిక తమకు తెలుసునన్న విషయాన్ని నాకు గురుబంధువు ద్వారా తెలియజెప్పిన వైనాన్ని తలచి, గురువుగారు ఇచ్చిన మాలను చూసి నేను మైమరచిపోయాను, ఆనందంతో పంచుకుంటున్నాను.

**- సుస్మిత**, విజయవాడ

## విద్యాభవన్ - అనుగ్రహపవన్

సద్గురు అనుగ్రహపు ఆనవాళ్ళు ఈ చిన్నారులు. వీరితో గురుదేవులకున్న బంధం చిన్నారులపై వారికున్న ప్రేమకు తార్కాణాలే ఈ లీలలు. గౌతమబుద్ధుని జ్ఞానోదయ క్షేత్రమైన బుద్ధగయకు పూజ్య గురుదేవులు వెళ్ళిన రోజున ఈ చిన్నారి జన్మించాడు. ఈ చిన్నారి బామ్మగారు, తాతయ్యగార్లు కృష్ణభక్తులు. అటు పెద్దవారిని గౌరవించే సంప్రదాయాన్ని మనకు నేర్పుతూ, సద్గురువును నిరంతరం స్మరించుకునే అవకాశమిస్తూ గౌతమ్‌కృష్ణ అని పిలవమన్నారు గురుదేవులు. "The one who gives also knows how to make you receive" - పూజ్య సద్గురువు శ్రీ బాబూజీ సత్సంగంలోని మాటలివి. సద్గురువు తన దుస్తర కార్యాన్ని ఎంతో అనుపమానంగా నిర్వహిస్తున్న తీరుకు మచ్చుతునక ఈ అనుభవం. అడిగినవన్నీ ఇస్తానన్న బాబా మాటకు కార్యరూపమే ఈ సద్గురు లీలా విలాసము. గౌతమ్ నాకిది కావాలి అని వారిని అడిగాడు, చల్లని దీవెనల నిండు చంద్రుడు తనకి కావలసింది ఇచ్చారు. ఇచ్చిన ఆ బహుమతిని పూర్తిగా ఆస్వాదిస్తున్నాడు, ఆనందంగా ఉంటూ అన్నిటా ముందుంటున్నాడు.

నా పేరు గౌతమ్. నేను చదివే స్కూల్‌లో 4వ క్లాసు వరకే ఉంది. తర్వాత ఏ స్కూల్‌లో చేర్పించాలా! అని మా అమ్మా, నాన్న మా స్కూలు మేడమ్‌ని అడిగితే భారతీయ విద్యాభవన్‌లో ప్రయత్నించమన్నారు. కానీ దాంట్లో సీటు రావడం చాలా కష్టం. చాలా కాంపిటీషన్ ఉంటుంది. నేను ఎంట్రన్స్ టెస్ట్ వ్రాయడానికి అప్లికేషన్ పెట్టి, తిరువణ్ణామలై వెళ్ళి గురువుగారి ఆశీర్వాదం





తీసుకుని వచ్చాను. నేను బాగా చదివి పరీక్ష వ్రాశాను. తరువాత మే లో గురువుగారు షిరిడీ వచ్చినప్పుడు మేము శిరిడీ వెళ్ళి గురువుగారు ఉన్నన్ని రోజులు అక్కడ ఉన్నాము. గురుబంధువులు తక్కువగా ఉండేసరికి మాకు దర్శనం చాలా బాగా అయింది. రోజూ గురువుగారు సాయిపథం నుంచి గురుచరణ్‌కి వెళ్ళే దారిలో నిలబడి, నాకు స్కూల్‌లో సీటు వచ్చేటట్లు దీవించమని అడిగేవాడిని. చిన్న బాబా ఫోటో కూడా గురువుగారి చేతుల మీదుగా తీసుకున్నాను. రోజూ రాత్రి లెండిలో, గురుస్థానంలో ప్రదక్షిణలు చేశాను. నేను హైదరాబాద్ వచ్చేసరికి నాకు స్కూల్‌లో సీటు వచ్చిందని తెలిసి చాలా ఆనందం వేసింది.

నాకు ఆ స్కూలు నచ్చింది. నేను అన్ని సబ్జెక్ట్స్‌లో యాక్టివ్‌గా ఉండటం చూసి నన్ను క్లాస్ లీడర్‌గా చేశారు. నేను చాలా హ్యాపీగా చదువుకుంటున్నాను.

నాకు క్వార్టర్లీ ఎగ్జామ్స్‌కి వారం రోజుల ముందు బాగా జ్వరం వచ్చింది. మూడు రోజులయినా తగ్గలేదు. మా డాడీ తిరువణ్ణామలైలో ఉన్నారు. అప్పుడు మా డాడీ గురువుగారికి నా జ్వరం గురించి చెప్పి ఊదీ అడిగారు. నా కోసం గురువుగారు ఊదీ ఇచ్చారు. మా డాడీ వచ్చి, నాకా ఊదీ పెట్టిన రోజే జ్వరం తగ్గిపోయింది. నీరసమంతా పోయింది. మర్నాడే స్కూలుకి వెళ్ళాను. చక్కగా చదివి పరీక్షలన్నీ బాగా వ్రాశాను. అడిగినవన్నీ ఇచ్చే గురువుగారంటే నాకు చాలా ఇష్టం - *bye. I will come back to tell some more experiences.*

**- ఎన్. గౌతమ్,** హైదరాబాదు

## హమారే మాలిక్ - శ్రీ బాబూజీ

'మాలిక్ హమారే తుమ బాబా సాయి' – మా అందరికీ మీరే యజమాని అంటూ దాసగణు కీర్తించి, కీర్తివంతుడయ్యాడు తన ఆరతి గీతంలో. హేమాడ్పంతుకు అవసరానికి తగ్గ జీతాన్ని అందించమని కోరిన అణ్ణాచించిణీకర్ బాబా ఏర్పాటు చేసిన వైనం. అదే క్రమంలో ధూమల్ అవసరం అతనికంటే బాగా తెలిసిన బాబా అతనికి ఎక్కువ వేతనాన్ని ఇప్పించిన లీల, దక్షిణగా 50 రూపాయలు తీసుకొని సాఠేకు 50 రూపాయలు ఎక్కువగా బాబా పింఛనును అందించడం – ఇలా సాయి లీలాసాగరంలో కొన్ని పుష్పాలు ఈ అనుభవాలు. ఆలోచించడమే మనకు తెలిసింది – అవసరం ఆ సద్గురుమూర్తికి ఎరుక. తనకు సమర్పించిన దానికి పదిరెట్లు తిరిగి ఇవ్వాల్సి వుంటుందని బాబా అనేవారు. మరి అడిగినదానికే పదింతలు ఇస్తున్న సద్గురు సాన్నిధ్యానికి తార్కాణమే ఈ లీల.

పూజ్యశ్రీ గురుదేవులకు నా సాష్టాంగ నమస్కారములు. ప్రియమైన గురుబంధువులతో నాకు గురుదేవులు ఇచ్చిన అనేక అనుభవస్మృతులను పంచుకోవాలని ఉంది.





# ఎన్నడు వీడని బంధమిది

నా పేరు టి. సుబ్రమణ్యం. నివాసం తిరుపతి. నాకు ఇద్దరు పిల్లలు. ఒక బాబు, ఒక పాప. మా అబ్బాయికి జ్వరము వచ్చినప్పుడు బాగా ఫిట్స్ వచ్చేవి. అలాంటిది నవంబరు 2005వ సంవత్సరములో ఫిట్స్ వచ్చినపుడు నేను ఫోన్‌లో ద్వారకనాథ్ రెడ్డిగారికి, భానుమూర్తిగారికి మా అబ్బాయికి ఫిట్స్ రాకుండా చూడమని, గురువుగారి ఆశీస్సులు మా అందరికీ ప్రసాదించమని, గురుదేవులకు చెప్పమని వేడుకున్నాను. ఆరోజు నుండి ఈరోజు వరకు గురుదేవుల కృపతో మరల బాబుకు ఫిట్స్ రాలేదు. ఇక రావు అని కూడా నేను నమ్ముతున్నాను. ఆ విధంగా గురుదేవులు మా అబ్బాయిని కాపాడారు.

నేను గత తొమ్మిది సంవత్సరములుగా ఒక ప్రైవేటు కంపెనీలో చాలీచాలని జీతంతో చాలా ఇబ్బందులు పడుతున్నాను. అక్కడ నాకు నెలకు రూ॥ 3,000/- జీతం వచ్చేది. ఆ బాధలు తట్టుకోలేక సత్సంగంలో గురువుగారిని నా కష్టాలు తీర్చమని ప్రార్థించేవాడిని. నేను రైల్వేలో వేరే ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తున్నాను. అక్కడ ఉద్యోగం వచ్చేటట్లు ఆశీర్వదించమని గురువుగారిని వేడుకునేవాడిని. ఈ ఉద్యోగం కనుక వస్తే నా కష్టాలు కడతేరుతాయని నా ఉద్దేశ్యం. ఆ ఉద్యోగ ప్రారంభ జీతం రూ॥ 3,000/- వస్తుంది.


కానీ నేను అనుకున్నది ఒకటి, గురుదేవులు ఇచ్చింది వేరే. ఇంతలో నాకు వేరే కంపెనీలో ఉద్యోగానికి పిలుపు వచ్చింది. నేను అక్కడకు వెళ్ళేముందు చెన్నైలో గురువుగారి దర్శనం చేసుకుని వారి ఆశీస్సులు తీసుకుని ఆ ఇంటర్వ్యూకు వెళ్ళాను. నేను రెండుసార్లు విఫలమైనా, గురుదేవుల దయతో సాయిబాబా నామం చెప్పుకుంటూ వెళ్ళేసరికి మూడవసారి ఆ ఉద్యోగంలో సెలెక్ట్ అయ్యాను. ఇప్పుడు నాకు రూ॥ 14,000/- జీతం. వారి ఆశీస్సుల మహిమతో అడిగినవన్నీ తీరుస్తున్నారు. గురుదేవుల అనుగ్రహ నీడన చల్లగా ఉన్నాము.

**- టి. సుబ్రమణ్యం**, తిరుపతి

భగవాన్! "సత్యాన్ని తెలుసుకోవడానికి సద్గురువు ఆవశ్యకమా?" అని అడిగారు పిగ్గెట్ అనే భక్తురాలు. "మానవుడు సత్యాన్ని తెలుసుకోవడంలో కేవలం సద్గురు అనుగ్రహమే ప్రాధాన్యత వహిస్తుంది. ధ్యానం, బోధ, ఉపన్యాసాలు ఇలాంటి ఉపకరణాలన్నీ ఇందుకు తోడ్పడేవే కానీ - సద్గురు అనుగ్రహమే ప్రథమము, ప్రాథమికము, విశిష్టము" అని తెలిపారు భగవాన్.

*"Is a Master necessary for realisation?" Mrs. Piggot asked. Bhagavan told "The realisation is the result of the Master's grace more than teachings, lectures, meditation, etc. They are only secondary aids, whereas the former is the primary and the essential cause".* ***- January 7th, 1935, TALKS WITH RAMANA***





# పంచాంగాల పట్టు - అనుగ్రహంతో ఒక 'పట్టు' పట్టు

మౌనం మహాత్ములనాశ్రయించిందే కానీ, మౌనాన్ని మహాత్ములు ఆశ్రయించలేదు. శాస్త్రవాక్యానికి, సజీవమైన సద్గురు వాక్యానికి ఉన్న భేదం ఎలా ఉంటుందనడానికి మరిచిపోలేని, మరిచిపోకూడని ఒక మధురస్మృతి ఈ అనుభవం. ఒకమాట వారినోట నుండి వెలువడితే సృష్టి మొత్తం దానికి సహకరించవలసిందే. "సద్గురు చరణాలనాశ్రయించి వారిని శ్రేయోభిక్ష పెట్టమని అర్థించిన చేతులను హస్తసాముద్రికుల ముందు దేబిరిస్తూ చాచడం - మనం ఆశ్రయించిన సద్గురువునే అవమానించి కించపరచడం కాదా?" గురుదేవుల ఈ మాటలు తూటాలై పంచాంగాల పట్టును, జాడ్యాన్ని వదిలించేశాయి ఈ గురుబంధువుకు - అనుగ్రహముంటే అవ్వనిదేముంది. ఎవరి మాటలకు చింతించలేదు, ఎవ్వరినీ ఆశ్రయించలేదు. సద్గురువుపై విశ్వాసముంచి ఈ గురుబంధువు పంచాంగాల పట్టును ఒక 'పట్టు'పట్టిన వైనం.....

నా పేరు కోరా చిన్న వీర వెంకట సత్యనారాయణ (చంటి). మా ఊరు యండగండి (తూర్పు గోదావరి జిల్లా, కె. గంగవరం మండలం). గురుదేవులకు వినయంగా నమస్కరిస్తూ, ఆయన కృపతో పొందిన నా ఈ అనుభవాన్ని మీ అందరితో పంచుకోవాలని నా ఈ ప్రయత్నం. బాబా, గురువుగారు ఎల్లవేళలా నన్ను వెన్నంటే ఉన్నారని ఈ లీల ద్వారా మరోసారి రుజువైంది. మాది యండగండి గ్రామం అయినప్పటికి, పిల్లల చదువుల నిమిత్తం రామచంద్రాపురంలో ఉంటున్నాను. జనవరి 7, 2005 యండగండి గ్రామంలో మా అమ్మగారి బంగారు ఆభరణాలు (సుమారు 18 తులాలు) ఎవరో దొంగిలించడం జరిగింది. ఊరి వాళ్ళంతా "పోలీసులకు ఫిర్యాదు చేయండి, మీ ఇంట్లో పనిచేసే వాళ్ళే తీసి ఉంటారు అని, వేరే ఎవరి వల్ల కాదు" అని నా మీద ఒత్తిడి తెచ్చారు.

నేను వెంటనే గురువుగారికి ఈ విషయం తెలుపమని నరేంద్రగారికి తెలియపరిచి, మా వస్తువులు మాకు తిరిగి ఇప్పించమని వేడుకొన్నాను. వెంటనే గురువుగారికి ఉత్తరం వ్రాసుకున్నాను. తరువాత మా బంధువులు, స్నేహితులు "పోలీసులకు ఫిర్యాదు ఇవ్వవలెను అని, అవి ఎక్కడ దొరికినా మనకు తిరిగి రావాలంటే పోలీస్ కంప్లైంట్ ఇవ్వవలసిందే" అని చెప్పడంతో 'సరే' అని నేను ఫిర్యాదు ఇచ్చాను. పోలీసువాళ్ళు మీకు ఎవరిమీదైనా అనుమానం ఉందా అని నన్ను అడిగారు. నాకు ఎవరి పైనా అనుమానం లేదు, నా బంగారం పోయింది, ఆ విషయం మీకు తెలియపరుస్తున్నాను అని చెప్పాను. వాళ్ళు ఫిర్యాదు నమోదు చేసుకున్నారు.

తరువాత ఊరివాళ్ళు, మా అమ్మగారు, బంధువులు "జ్యోతిష్కుని దగ్గరకు వెళ్ళు అక్కడ నిజం చెబుతారు" లేదా "ఫలానా ఊళ్ళో అమ్మవారు పూనకంలో నిజం చెబుతుంది వెళ్ళు వెళ్ళు" అని నాకు మనశ్శాంతి లేకుండా చేశారు. **బాబా ముందు చాపిన ఈ చేతుల్ని తిరిగి జ్యోతిష్కుని ముందు చాపడం, బాబాను, గురువుగారిని అవమానించడమే అని సత్సంగంలో**







**చెప్పుకున్న మాటలు నా మదిలో మెదిలాయి.** అదేరోజు ఈనాడు పేపర్‌లో చిన్న ఆర్టికల్ పడింది. "శ్రీకృష్ణదేవరాయుల ఆస్థానంలో ఒక ప్రముఖ జ్యోతిష్కుడు వచ్చి రాజుగార్కి జరిగినవి, జరుగుతున్నవి, జరగబోయేవి చెప్తూ ఉంటే, రాజుగారు సంతోషంతో ఆ జ్యోతిష్కుని సత్కరించి, బహుమతులు ఇచ్చి సభలో ఎవరైనా ఈయనను పరీక్షించదలచితే పరీక్షించవచ్చు అని ప్రకటిస్తారు. అప్పుడు తెనాలి రామకృష్ణుడు ముందుకు వచ్చి ఒక పెద్ద బండరాయి తీసుకుని వచ్చి ఈ బండరాయి ఇప్పుడు క్రిందపడుతుందా! లేక నీ నెత్తిమీద పడుతుందా అని అడుగుతాడు. అప్పుడు జ్యోతిష్కుడు తన ఓటమిని అంగీకరిస్తాడు" ఇది ఆ ఆర్టికల్‌లో ఉన్నది. ఇది చదవగానే గురువుగారే ఈ ఆర్టికల్ నాకు చూపినట్లు అనిపించి నా మనసుకు ఎంతో హాయిగా అనిపించి బాబా, గురువుగారు ఉన్నారు అని నా మనసులో పూర్తిగా నమ్మకం ఏర్పడింది. ఈ జ్యోతిష్కులు, పూనకాలు వట్టిమాట అని బలపడింది. ఎవరైనా వాళ్ళవద్దకు వెళ్ళమంటే పై కథ చెప్పేవాడిని.

జనవరి 10వ తేదీన గురువుగారు శిరిడీ వస్తున్నారు అని తెలిసి మా అమ్మగార్ని మా అక్క ఇంటివద్ద ఉంచి, 12వతేదీన నేను, నా భార్య కలిసి శిరిడీ వెళ్ళాము. 14వ తేదీన గురువుగారి దర్శనం చేసుకున్నాము. గురువుగారు 'సాయియానా' నుండి 'గురుచరణ్'కు వచ్చుదారిలో నిల్చొని పోయిన నగల గురించి గురువుగార్కి తెలిపి, తిరిగి ఇప్పించవలసిందిగా వేడుకున్నాము. గురువుగారు తల ఊపి, ఆశీర్వచనాన్ని ఇచ్చారు. ఇక గురువుగారు చూసుకుంటారని – ఆ విషయాన్ని అక్కడితో వదిలేశాము. అలా 9 మాసాలు గడిచాయి.

సెప్టెంబరు 22 గురువారం నా స్నేహితుడు నాకు ఫోన్ చేసి మీ బంగారం దొంగిలించినవాడు మీ దగ్గరకు వచ్చి జరిగిన విషయం అంతా చెబుతానని అంటున్నాడు. అతని దగ్గర ఒక గాజు ఉంది అని చెప్పాడు. నేను అప్పుడు రామచంద్రాపురంలో ఉన్నాను. నేను వెంటనే యండగండి బయలుదేరి వెళ్ళాను. రాత్రి 8 గంటల సమయంలో నాకు ఫోన్ చేసి నా మిత్రుడు, ఆ దొంగిలించిన వ్యక్తిని తీసుకువచ్చాడు. ఆ వ్యక్తి పూర్వం మాకు జీతగాడిగా పని చేయడంతో మాకు ఆ వ్యక్తితో పరిచయం ఉంది. "విషయం ఏమిటి అంటే?" ఆ వ్యక్తి తన వద్ద ఉన్న ఒక్క గాజుని ఇచ్చివేసి, మిగిలినవి ఏవి? అని అడగ్గా తనతో పాటుగా మరో ఇద్దరు వ్యక్తులు ఈ దొంగతనంలో ఉన్నారని, వారి పేర్లు తెలిపాడు.

వాళ్ళను పిలిచి ఆరాతీస్తే, జరిగిన విషయాన్ని అంతా మాకు చెప్పారు. మిగిలిన బంగారాన్ని ఎక్కడ దాచిందన్న విషయం కూడా తెలిపారు. ఆ పిల్లల తల్లిదండ్రులు వచ్చి, ఆ బంగారం మొత్తం తెచ్చి మీకు అప్పగిస్తాము అని మాట ఇచ్చారు. మరునాడు ఒక్కో వస్తువు తెచ్చి ఇచ్చివేశారు. $3^1/_2$ తులాల గొలుసు యాదగిరి (కర్ణాటక రాష్ట్రం) లో ఉన్నదని సాయంత్రానికి





అది కూడా మాకు అప్పగించారు. ఒక నాలుగు గాజులు అమ్మివేశారు. వాటికి రేటు కట్టి డబ్బు రూపంలో అప్పగించుటకు వాళ్ళ పెద్దలు ఒప్పుకున్నారు.

ఇదంతా కూడా నా ప్రమేయం ఏమీ లేకుండా కేవలం బాబా, గురువుగార్ల కృపతోనే జరిగింది. ఇదంతా గురుదేవుల కరుణ, బాబా నాపై కురిపించిన అనుగ్రహపు ప్రేమ. నాపై బాబా, గురుదేవులు చూపిన కరుణకు పాదాభివందనం చేసుకున్నాను.

మొన్న యండగండిలో సెప్టెంబర్ 9వ తేదీన జరిగిన బాబా సత్సంగ వార్షికోత్సవంలో పాల్గొనడానికి విచ్చేసిన బాలకృష్ణరావుగారి వద్ద నా సందేహాన్ని వెలిబుచ్చాను. "గురువుగారితో మాట్లాడాలని వుంది. గురుదేవులు మాతో మాట్లాడరా" అని. దానికి సమాధానమా అన్నట్లు ఎప్పుడూ మీతోనే వున్నా – అని బాబా, గురుదేవులు నాతో చెప్పినట్లు ఈ లీలతో నాకు అనుభవమయింది. అనుభవాలను పొందడం వల్ల రాదు వివేకం. అనుభవాలను అర్థం చేసుకోవడం వల్ల వివేకం నిలిచిపోతుంది, దివ్యంగా వెలుగుతుంది.

**– కోరా. సత్యనారాయణ**

## చిరునీడ – చిరునామా

తనకు తానుగా ఎగరలేని ధూళి – గాలి సాంగత్యంతో ఎలా పైకి ఎగురుతుందో, సామాన్య మానవుడు సత్సంగం యొక్క సాంగత్యంతో ఉన్నత శిఖరాలను చేరగలడు. సత్సంగం యొక్క వైభవం, విలువ అసమానమని శృతి స్మృతులు వేనోళ్ళ కీర్తించాయి. సత్సంగమనే మహాత్ముల సాంగత్యం లేనివాడు సామాన్య భక్తుడని భాగవతం చెబితే, భౌతిక సంపదలను కాక భగవత్‌భక్తి, భూతదయ, సత్సంగాన్ని మాత్రమే అనుగ్రహించమని భాగవతుడైన సుధాముడు వేడుకున్నాడు. సుధామునికి కృష్ణుడు సత్సంగాన్ని వరంగా ప్రసాదిస్తే పూజ్య గురుదేవులు మనల్ని మనలుగా ప్రేమిస్తూ (సద్గుణాలతో పాటు దుర్గుణాలు కూడా ఉన్న మనల్ని) నిరంతరం అనుగ్రహిస్తూ, అవ్యాజ ప్రేమ రూపమైన సద్గురు తత్వాన్ని గుర్తించమంటూ మన హృదయ ద్వారాలను తెరిచేటందుకు ఒక గొప్ప సాధనాన్ని ప్రసాదించారు. అట్టి గొప్ప సాధనావరాల చిరునామాలు.....

### సాయిబాబా సత్సంగ కేంద్రాలు, గుంటూరు

1. Sri G. Krishnaiah garu, C/o. Sai Baba Temple, Vysya Bank Colony, Vidhya Nagar Extn., GUNTUR - 7, Time : Every Day 7-00 to 8-30 P.M., Ph : 93907 30147
2. Sri G. Siva garu, D.No. 5-92-43/1, Beside Prajapitha Brahma, Kumari Samajam,, Devapuram 2nd Line, Guntur - 2, Time : Every Friday 7-00 to 8-30 P.M., Ph : 0863-2320987
3. Youth Girls Satsang, C/o. Raju garu, Near Sai Baba Temple, Vidya Nagar Etxn., Guntur - 7. Time : Every Sunday 3-00 to 5-00 P.M., Ph : 0863-2325715





# పొత్తిళ్ళు అమ్మవి - రక్షణ శ్రీ బాబూజీది

చరాచర జగత్తుకు రక్షకుడైన సద్గురువుకు ఈ జగమంతా కుటుంబమే. తన భక్తులు ఎక్కడ ఉన్నా, ఏం చేస్తున్నా ఏ క్షణమైనా అవసరమైన మరుక్షణం రక్షణ వారిదే సుమా! త్రయంబక్ డేంగలే పొలాల్లో పనిచేస్తున్న ఒక తల్లి పనిచేస్తున్న సమయంలో వర్షం పడడంతో అందరితో పాటు పరుగులెత్తి పాకలోకి వెళ్తుంది. ఇంతలోనే నిద్రపుచ్చిన తన బిడ్డ గుర్తొచ్చి పరుగెత్తి బిడ్డ చెంతకు చేరుతుంది. ఆ సరికే బాబా అక్కడకు చేరి బిడ్డకు రక్షణై తల్లిని మందలిస్తారు. తరువాత విచారిస్తే, ఆ సమయంలో బాబా శిరిడీలో ఉన్నారని తెలుస్తుంది. ఈ అనుభవంలోనూ అలాగే జరిగింది. అయితే రక్షించింది ఎవరు? ఏలినవారు ఎక్కడున్నారు ఆ సమయాన? ఆసక్తిగా ఉంది కదూ! అనుభవంలోకి వెళ్ళండి.....

నా పేరు వినయ్‌సాగర్. మేము స్టీల్‌ప్లాంట్‌లో ఉంటున్నాం. 2005 మే నెలలో నాకు పదవ తరగతి పరీక్షలు అయిపోయాయి. మా అమ్మ, నాన్న ముందుగానే తిరువణ్ణామలై వెళదామని ప్లాన్ చేశారు. ఒక వారం గురువుగారి వద్ద వుండి, తరువాతి వారం బెంగుళూరులో ఉందామని మా ఆలోచన. ఎంతో ఆనందంగా గురువుగారికి చెప్పుకుని బయలుదేరాం. రైల్లో ప్రయాణమంటే మా తమ్ముడికి చాలా ఇష్టం. రైల్లో మా బెర్తులు ఎలా వచ్చాయంటే, Side Lower, Upper, Upper, Middle వచ్చాయి. Side Lower బెర్తువద్ద ఎమర్జెన్సీ విండో ఉంది, అది తెరిచివుంది. అక్కడ చాలామంది కూర్చొని చేతులు బయటకు పెట్టుకుని ఉన్నారు. ఇక్కడ నేను ఆ విండో గురించి ఎందుకు చెప్తున్నానంటే అక్కడే ఆపద పొంచివుందన్న సంగతి మాకు తరువాత తెలిసింది. మేమందరం రాత్రి 10 గంటలకు పడుకున్నాము. అమ్మ, నాన్న ఒక బెర్తులో, తమ్ముడు, నేను ఒక బెర్తులో పడుకున్నాము. మా తమ్ముడు తరచుగా ఎమర్జెన్సీ విండోలో చెయ్యి పెట్టడం జరుగుతూవుంది. అమ్మ, నాన్న చెప్పడం, నేను వాడిచేత ఆ చేయి తీయించడం ఇలా జరుగుతూ వుంది. కానీ వాడు చేయి పెట్టడం మానలేదు. ఉన్నట్లుండి ఒక పెద్ద శబ్దం వచ్చింది. అందరం చాలా ఆశ్చర్యపోయాము. ఆ ఎమర్జెన్సీ విండో క్రిందికి పడిపోయింది. కానీ ఆ సమయంలో ఎవరో తీసినట్లు వాడి చేయి ప్రక్కనపెట్టుకుని పడుకున్నాడు. మా కళ్ళలో ఆనందం. గురువుగారి రక్షణ ఎలా వుంటుంది అనేది మేం చూశాం. 'నా బిడ్డల్ని నేనే ఎన్నుకుంటాను' అని బాబా అన్నారు. నిజంగా ఆయన బిడ్డల్ని ఎన్నుకున్న తరువాత రక్షణ అనేది వారి బాధ్యత. ఆ ఆపద కూడా గురువుగారి ముందు ఓడిపోయింది. గురువుగారికి మనం చెప్పుకున్నా, చెప్పుకోకపోయినా వారు మాత్రం మనల్ని కంటికి రెప్పలా కాపాడుతూ ఉంటారు అనేది తెలుసుకున్నాను. ఈ ట్రిప్‌లో మేము బెంగుళూరు వెళ్ళకుండా రెండు వారాలు గురువుగారి చెంతనే గడిపాం. గురువుగారు మాకిచ్చిన ఈ అనుభవాన్ని మీ అందరితో పంచుకున్నందుకు చాలా ఆనందంగా వుంది.

**- వినయ్‌సాగర్**, స్టీల్‌సిటీ.





# రసస్పందన

రసస్పందన – ఆధ్యాత్మిక రసస్పందన – సద్గురు భక్తి – అనే రసాయన చర్య జీవితపు అన్ని అంశాల్లో జరుగుతుండగా భక్తిసంద్రంలో ఓలలాడిన భక్తుల స్పందన. మధురాతి మధురమైన సద్గురు భక్తికి వారే ఆచార్యులు, భక్తి జీవనమునకు మార్గమును చూపు చరిత్రకారులు. వీరి మార్గము విశేషము, వైవిధ్యము, అనుభవైక వేద్యము. సద్గురువు పట్ల అణువణువునా ప్రేమను నింపుకొని, తొణికిసలాడే సద్గురు అనుగ్రహమనే అమృత భాండమును శిరమున దాల్చి, అవసరమున్నచోట, సద్గురుమూర్తి ఆదేశించిన చోట ఆ అమృతాన్ని పంచుతూ, వారిలో ప్రేమను పెంచుతూ, తాను పెంచుకుంటూ అలా... అలా... అలలా సాగిపోతారు, మరువలేని కలలా మిగిలిపోతారు..... బాబా చరిత్రలో దాసగణులా!

పిచ్చుక కాలికి దారం కట్టి లాక్కొన్నట్లు భక్తుని తన చెంతకు సద్గురువే చేర్చుకుంటే, ఆ బంధంలో ఉన్న బాధ్యతను చూసి భక్తుడు పరవశిస్తాడు. పరవశంలో ఆయన 'వశం' అయిపోయి, తన మనప్రాణాలను అర్పించి జన్మజన్మలకు 'ఋణంతో' ఆ బంధాన్ని పటిష్టపరచుకుంటాడు. జీవితమనే ఒక తక్కువ వ్యవధి ప్రయాణంలో అనుక్షణం ఆ సద్గురుమూర్తికై ఆరాటపడుతూ, వారిని స్మరించని క్షణాలను విస్మరించడానికి ఇష్టపడతాడు. మాట స్వామిది, పాడే పాట స్వామిది, ఊసు స్వామిది, ఊహ స్వామిది, బాస స్వామిది, మాట్లాడే భాష స్వామిది, జీవిస్తే స్వామి ధ్యాస, కడకు మరణించినా...................... ఆ మహితమూర్తి పాదాలచెంతనే అంటూ మన గమ్యమేమిటో, మన గమనం ఎలా ఉండాలో ఆచరించి చూపారు. ప్రేమను వ్యక్తీకరించడమనే సుమధుర అంశానికి సద్గురువు చేతిలో చక్కని ఉపకరణాలుగా మిగిలారు. ఈ భక్తుల చరిత్రను చూస్తూ ఉంటే సద్గురువే తనను తాను వ్యక్తం చేసుకున్న అద్భుతమైన సందర్భం ఇది అని అన్పించక మానదు.

అట్టి సద్గురు భక్తులలో శ్రేష్ఠులు శ్రీరామ్‌చంద్ర దత్త. 1851వ సం॥ అక్టోబర్ 30వ తేదీన కలకత్తాలో జన్మించిన రామ్, తల్లిదండ్రుల ధార్మిక చింతనను చూసి ఆ నైజాన్ని అలవరచుకున్నాడు. తను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉండటం అతని సహజనైజం తల్లి చనిపోయి, సవతి తల్లితో సర్దుకుపోలేక బంధువుల ఇంట ఉండి చాలా కష్టాలు పడతాడు రామ్‌చంద్ర. విజ్ఞానశాస్త్రం పట్ల తనకున్న ఆసక్తి అతనిచేత అతిసార వ్యాధికి మందును కనుగొనేట్లు చేస్తుంది. ఇంగ్లండ్ ఔషధ విక్రేతల సంఘంలో సభ్యునిగా, రసాయన పరీక్షాధికారిగా, కలకత్తా వైద్య కళాశాలలో బోధకునిగా రామ్ తన విజ్ఞానాన్ని పంచుతూ పోవడం జరిగింది.

రామ్‌కు ఆధునిక విజ్ఞానం పట్ల ఉన్న ఉత్సుకత అతణ్ణి నాస్తికునిగా మార్చివేసింది. భగవంతుడు లేడని, ప్రకృతి నిర్బంధం వల్లనే ఇదంతా జరుగుతున్నదని వాదిస్తూ, చర్చల్లో ప్రత్యర్థులను ఓడిస్తూ తన నాస్తికత మీద ఉత్సుకతను ఐదేళ్ళు కొనసాగిస్తాడు రామ్.





ఇక ఆ తర్వాత సద్గురు లీలా వినోదానికి రంగం సిద్ధమవుతుంది. రామ్ చిన్న కుమార్తె మరణం అతనిలో ఒక గొప్ప మార్పును తెస్తుంది. భగవంతుని ఉనికి కోసం అతని జీవితంలో ఒక గొప్ప అన్వేషణ ప్రారంభమవుతుంది. భగవద్దర్శనం చేసుకోవాలన్న అతని తపన (తపస్సు) అంతకంతకు పెరిగిపోతుంది. ఎందరో మత నాయకులను దర్శించినా తన తపనకు సమాధానం లభించదు. అదే సమయంలో తన కులగురువు దీక్షనివ్వడానికి తనవద్దకు వస్తాడు. ఆయన చెంతన కూడా భగవంతుని గూర్చిన సమాధానం అతనికి తృప్తినివ్వదు. రోజురోజుకూ వటవృక్షంలా పెరిగిపోతున్న అలజడి అతనిని మరింత ఇబ్బందికి గురిచేస్తుంది. ఇటువంటి స్థితిని వర్ణిస్తూ గురుదేవులు చెప్పిన మాటలు గమనిద్దాం "మానసిక స్థితి, సంకుచిత ఆలోచనలనే ఇరుకు గోడల మధ్య నలిగిపోతున్న మనం ఊపిరాడని ఒక నిస్సహాయ స్థితికి లోనవుతాం. ఆ వేదన భరించలేని స్థితికి చేరి, ఎప్పుడు హృదయం – ఆ ఇరుకు గోడల ఇనుప చట్రం నుంచి బయటకు రావడానికి ప్రయత్నిస్తుందో అప్పుడు మనలో ఆధ్యాత్మిక సాధన ప్రారంభమవుతుంది. అట్టి స్థితిలో మనకు అవసరమైనది ఒక కిటికి, ఆ కిటికి మరేదో కాదు సద్గురువు. పరిమితులు లేని ఆకాశాన్ని, స్వచ్ఛమైన గాలిని మనకందించడానికి ఏర్పాటు చేయబడిన సద్వస్తువు ఆ సద్గురువే (కిటికి)". *(Please Refer '**Window**' by Guruji in Sai Patham Diary 2003).*

రామ్ జీవితంలో ఇట్టి మానసిక స్థితే అతన్ని రామకృష్ణుల వద్దకు చేర్చుతుంది. కేశవచంద్రసేన్ రచనల మిషగా శ్రీరామకృష్ణుల గూర్చి తెలుసుకున్న రామ్, 1879 నవంబర్ 13న రామకృష్ణులను దర్శిస్తాడు. మూర్తీభవించిన నిరాడంబరతతో శ్రీరామకృష్ణులు దర్శనమిచ్చి 'నారాయణ' అని సంబోధిస్తూ కూర్చోమంటారు. రామ్‌ను పలకరిస్తూ ఇలా అంటారు "మీరు వైద్యులుకారా! ఇతడు జ్వరంతో బాధపడుతున్నాడు" అని ప్రక్కన కూర్చున్న అతన్ని సంబోధిస్తారు రామకృష్ణులు. తానొక వైద్యుడినని వారికి తెలియడం రామ్‌ను ఆశ్చర్యపరుస్తుంది. తనను సొంత మనిషిలా చూసుకుంటున్న గురుదేవులను ప్రతి ఆదివారం దర్శించుకుంటాడు రామ్. కొంతకాలం గడిచాక రామకృష్ణుల వద్ద భగవంతుని పట్ల తన సందేహాలను వెలిబుచ్చుతాడు. ఆశాజనితమైన రామకృష్ణుల సమాధానాలతో కొంత శాంతిని పొందుతాడు. మరలా కొంత కాలానికి భగవంతుని ఉనికిని గూర్చిన ఈ సంఘర్షణ ప్రారంభమవుతుంది. దీన్ని గురించి ఒక మిత్రునితో సంభాషిస్తుండగా ఒక పొడగరి అయిన అపరిచిత వ్యక్తి అతని వద్దకు వచ్చి "ఎందుకు అంతగా ఆతురత చెందుతున్నావు, సహనం వహించు" అంటూ గుసగుసలాడి వెళ్ళిపోతాడు. వారే ఆ మాట చెప్పినట్లుగా సంకేతమిస్తారు రామ్‌కు శ్రీరామకృష్ణులు.

రామకృష్ణుల సాంగత్యంలో ఆనందాన్ని చవిచూసిన రామ్‌కు లౌకిక సుఖాలు నిస్సారంగా తోస్తాయి. దాంతో రామ్ సంసార పరిత్యాగం చెయ్యాలని అనుకొని రామకృష్ణులను తరచుగా కోరుతుంటాడు. రామకృష్ణులు వారిస్తూ ఉంటారు. పదేపదే ఈ విషయాన్ని ప్రస్తావిస్తున్న





రామ్‌తో ఒకసారి కటువుగా ఇలా చెప్పారు. "సంసార పరిత్యాగం చేసి ఏం లబ్ధి పొందుతావు. సంసారంలో జీవించడమంటే ఒక కోటలో జీవించడం లాంటిది. శత్రువును కోట బయట నుండి ఎదుర్కోవడం కన్నా, కోటలో నుండి ఎదుర్కోవడమే సులభం...." అని చెప్పడంతో, గృహస్థుడైన ఆదర్శ భక్తునిగా ఉండిపోవాలన్న కృత నిశ్చయానికి వస్తాడు రామ్. అసాధారణమైన రామకృష్ణుల ఆధ్యాత్మిక శక్తి అతనిలో మరింత విశ్వాసాన్ని నింపుతుంది.

రామకృష్ణుల భక్తులు వారి ఇండ్లలో ఉత్సవాలను ఏర్పాటు చేసుకుని వారి గురువును, భక్తులను పిలుస్తుండడం కద్దు. అట్టి ఆనంద సమయంలో అయ్యే ఖర్చును ఆ భక్తుడే భరిస్తుండేవాడు. రామ్ స్వతహాగా పిసినారి. దాంతో రామకృష్ణులను ఆహ్వానించ సంకోచించేవాడు. ఒకసారి రామకృష్ణులే స్వయంగా వస్తాననడంతో ఆనందంగా అన్ని ఏర్పాట్లు చేశాడు. 1883 జూన్ 2వ తేదీ రామకృష్ణులు రామ్ ఇంటిని పావనం చేసి, రామ్ పిసినారితనాన్ని కూకటివ్రేళ్ళతో తీసేసి, స్థానే ఉదారత అనే పారిజాత వృక్షాన్ని నాటారు. ఆ తరువాతి రోజు రాత్రి దక్షిణేశ్వరం వచ్చి ఇంటికి బయలుదేరిన రామ్ వద్దకు హఠాత్తుగా రామకృష్ణులు వచ్చి "సరే, నీకు ఏం కావాలి?" అని అంటూ కల్పతరువులా ముందు నిలిచారు. రామకృష్ణుల పట్ల భక్తిని, వారిచ్చిన అనుభవాల ద్వారా వివేకాన్ని అణువణువునా నింపుకున్న రామ్ ఉద్వేగంతో ఇలా జవాబిచ్చాడు **"ప్రభూ! ఏం కోరుకోవాలో నాకు తెలియదు. మీరే నిర్ణయించండి"** – "ఇకపై నువ్వు ఆధ్యాత్మిక సాధనలు చేయనవసరం లేదు. అప్పుడప్పుడు ఇక్కడికి వచ్చి నన్ను చూస్తే చాలు. వచ్చేటప్పుడు ఒక పైసా పెట్టి ఏదైనా కొని తెస్తూ వుండు" సద్గురు దర్శనానికి ఉన్న ప్రాధాన్యతను, గృహస్థాశ్రమ ధర్మాన్ని మరొక్కసారి తెలియజేస్తూ రామకృష్ణులు ప్రవచించిన తీరు రామ్‌లో మరింత విశ్వాసాన్ని పాదుకొల్పుతుంది.

మనోవాక్కుల ఐక్యతే మతమన్న శ్రీరామకృష్ణుల అభిప్రాయాన్ని తన జీవన విధానంగా మార్చుకున్నాడు రామ్. కృతనిశ్చయుడిగా, పురోషోచితంగా ఉంటూ, నీతికి, నిజాయితీకి, నడవడికి ఆదర్శప్రాయంగా ఉండేవాడు. రామకృష్ణులు అతణ్ణి **'కెప్టెన్'**గా పేర్కొనేవారు. జీవితంలో ఎంతో ఉన్నత హోదాలో ఉన్నా నిరాడంబరుడుగా మెలిగాడు. సద్గురువనే లక్ష్యాన్ని చేరడానికి తన హోదా, డబ్బు, జ్ఞానం, వాక్కు ఇత్యాదులన్నీ ఉపకరణాలుగా భావిస్తూ తాను అనుభవిస్తున్న ఆనందాన్ని ఎందరికో పంచాడు. రామకృష్ణుల పట్ల తనకున్న ప్రగాఢ భక్తి విశ్వాసాలు అతడిని ఒక గొప్ప ధర్మోపదేశకునిగా మార్చాయి. 1893–1897 మధ్యకాలంలో రామ్ చేసిన 18 ప్రసంగాలు కలకత్తాలో సంచలనం సృష్టించాయి. సద్గురువును తెలుసుకోవాలన్న ఎందరి ఆకాంక్షలకో ఈ ప్రసంగాలు అమృతతుల్యమయ్యాయి. తన నిర్ణయాన్ని శాస్త్రవచనాల ద్వారా, విచారణ ద్వారా అనుభవాత్మక ప్రమాణాల ద్వారా, తన స్వానుభవాల ద్వారా రూఢిపరిచాడు.





# ఎన్నడు వీడని బంధమిది

"ఆ స్తంభాన్ని పూజించుకోండి" అంటూ గురుపూర్ణిమ నాడు బాబా చెప్పిన మాటకు, చరిత్రలో బాబా భక్తులు ఎలా స్పందించారో మనకందరకు తెలుసు. అదే తీరున ఒకరోజు రామకృష్ణులు జగజ్జననికి పూజ చేయాలని వాంఛిస్తారు. భక్తులు ఏర్పాట్లు చేస్తారు. రామకృష్ణులు ధ్యానమగ్నులవుతారు. రామ్‌కు మనస్సులో ఈ ఆలోచన మెదిలింది. "గురుదేవులు పూజించనవసరం లేదు. మనమే గురుదేవులను పూజిద్దాం" అని గురుబంధువులతో చెప్తాడు రామ్. వెంటనే "జై శ్రీరామకృష్ణా! జై జగజ్జననీ!" అంటూ దివ్యదరహాసంతో, తేజోవిరాజమైన రామకృష్ణులను పూజించి ధన్యులవుతారు.

'భక్తులను సేవించేవారు నిజానికి నన్ను సేవించినవారవుతారు' అన్న రామకృష్ణుల వాక్కు మనోఫలకంపై ముద్రించుకుని, "శ్రీరామకృష్ణులను సేవించేవారు నా అతి సమీప బంధువులని" రామ్ అనేవాడు. గురుస్మరణలో గడపని కాలాన్ని విషతుల్యంగా భావించేవాడు రామ్. సామాన్యంగా నలుగురు కలుసుకున్నప్పుడు ఉబుసుపోక కబుర్లతో, ఇతరులను విమర్శించడంలో సమయాన్ని గడిపేస్తారు. కానీ రామ్, తన సమక్షంలో శ్రీరామకృష్ణుల గూర్చి గానీ, ఆధ్యాత్మిక జీవితం గూర్చి గానీ తప్ప మరే ఇతర విషయాలు మాట్లాడడానికి ఎవరినీ అనుమతించేవాడు కాదు. తను మాట్లాడే ఏ విషయమైనా గురువు గుర్తుకొచ్చే విధంగా ఉండేది. రామకృష్ణులను గురించి చెప్పేటప్పుడు తన మోము ఆనందంతో వెలిగిపోయేది. కళ్ళవెంట అశ్రుధార కట్టేది. భక్తి, విశ్వాసాల భవ్యరూపం దర్శనమిచ్చేది. బాబా చరిత్రలో బిడ్డ చనిపోయిన సందర్భంలో, రేగేలో కన్పించిన పరిణతి రామ్ జీవితంలో కానవస్తుంది. ఒక ప్రమాదంలో బిడ్డ చనిపోగా, ఓదార్చడానికి వచ్చిన వారితో రామ్ ఇలా అంటాడు "భగవంతుడు ఆ కుమార్తెను నాకు ప్రసాదించాడు, ఆయనే ఇప్పుడు తీసుకుపోయాడు. నేనెందుకు కుమిలిపోవాలి".

"కేవలం వారి చూపుతో, స్పర్శతో, స్మరణతో........" అంటూ శ్రీబాబూజీ అనే శీర్షికలో (సా.భ.సా.ర.) సద్గురువును గూర్చి వెలువరించిన తీరుకు సోదాహరణలు రామ్ యొక్క క్రింది భావనలు. శ్రీరామకృష్ణులు ఒక్కరోజు సైతం పావనం చేసిన చోటు పుణ్యతీర్థమని, ఆయన వద్దకు వచ్చి ఒక్కసారైనా సేవించిన వారు తరిస్తారనీ రామ్ తరచూ చెప్పేవాడు. గురుదేవులు కలకత్తా భక్తులను సందర్శించడానికి పయనించి వచ్చిన గుర్రపుబండీ, ఆ గుర్రాలు, ఆ బండివాడు వారి స్పర్శచే పునీతులైనారని రామ్ దృఢంగా చెప్పేవాడు. అయితే ఆయనను దర్శించిన ప్రతి వారికి ముక్తి లభిస్తుందనుకుంటున్నావా! అని వ్యంగ్యంగా అన్నవారికి రామ్ సమాధానమిది **"తమ బండిలో గురుదేవులను తీసుకొని వెళ్ళిన బండివాడి పాదధూళి పుచ్చుకో, గురుదేవులను చూసిన దక్షిణేశ్వర ఆలయం ఊడ్చిన పనిమనిషి పాదధూళి పుచ్చుకో – అలా చేస్తే నీ జీవితం పునీతమై నువ్వు తరిస్తావు"** అంటూ తన సద్గురువు పట్ల తనకున్న విశ్వాసాన్ని వెల్లడి చేశాడు రామ్. సద్గురు సందర్శనం, స్పర్శ, స్మరణ వంటి మహత్తర అంశాలకు మన జీవితంలో ఉండవలసిన ప్రాధాన్యతను ఈ మాటలు ఎంతైనా ఇనుమడింపచేస్తాయనడంలో సందేహం లేదు.





ఇక రామ్ చివరి రోజుల్ని పరికిద్దాం! 1889లో అతడు తీవ్ర రక్తవిరేచనాల వ్యాధికి గురయినాడు. గురుబంధువుల సేవలు, చికిత్సా ఎంతో లభించినా రామ్ ఆరోగ్యం క్షీణించింది. నిద్రపట్టని రాత్రులు గురుదేవుల నామాన్ని జపిస్తూ రామ్ గడిపాడు. నెలన్నర గడిచిన తరువాత తాను మరెంతో కాలం బ్రతకనని రూఢి పరచుకున్నాడు. గురుదేవుల అస్థికలు ప్రతిష్ఠించిన పావనమైన ప్రదేశంలో తాను మరణించాలని, ఆ ప్రదేశానికి చేరుకొని "నా గురుదేవుల ప్రక్కన ఇక శాశ్వత విశ్రాంతి తీసుకోవడానికి ఇక్కడకు వచ్చేశాను" అన్నాడు. ఆపైన ఐదు రోజులు మాత్రం జీవించాడు. 1889 జనవరి 17వ తేదీ రాత్రి గం|| 10:45 ని||లకు రామకృష్ణుల పాదసన్నిధిని చేరాడు రామ్. చనిపోవడానికి మునుపు తన వారితో చెప్పిన ఈ మాటలు - సద్గురువు పట్ల తనకున్న విశ్వాసానికి, ప్రేమకు, భక్తికి ప్రతీకలు. "నా మరణానంతరం నా చితాభస్మంలో కొంత యోగోద్యానం (రామకృష్ణుల అస్థికలు ప్రతిష్ఠించిన చోటు) ముఖద్వారం క్రింద పాతిపెట్టండి. యోగోద్యానంలోకి వచ్చేవారు నా తలమీదుగా నడిచిపోతారు. ఆ విధంగా గురుదేవుల భక్తుల పాదస్పర్శ సదా నేను పొందగలుగుతాను"

రామ్ జీవితంలోని ప్రతి విషయం తన గురువుతో మమేకమే. మానవ జీవితమనే అమూల్యమైన, అతి తక్కువ సమయాన్ని వృథా కానివ్వకుండా గురుస్మరణలో, గురునామంలో గురు దర్శనంలో గడిపి చరితార్థుడయ్యాడు. తన సమక్షంలో ఎవరైనా ఇతరులు వేరే విషయాలు మాట్లాడుతుంటే వారిని అనుమతించేవాడు కాదు రామ్. సద్గురు పథంలో మనకొక చక్కటి సజీవచిత్రంగా భాసించాడు. జరిగిపోయిన కాలాన్ని గూర్చిన చింతన, జరగబోయే కాలాన్ని గూర్చిన ఆందోళన మానేద్దాం. ఈ క్షణం నుంచి వర్తమానానువర్తులమై గురునామ స్మరణలో గడిపి గమ్యం చేరుదాం...........

**- గురుకృప**

## నవ్య జీవనం - నవ వసంతం

**'గురుకృప' పత్రిక ప్రారంభించి ఈ సంచికతో అష్ట వసంతాలు నిండి, నవ వసంతంలోకి అడుగిడింది. గురుకృప చేస్తున్నదేమిటి? అందిస్తున్నదేమిటి? అని ఆలోచిస్తే, బాబా చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. "కథలను, అనుభవములను ప్రోగుచేయమనుము. అక్కడక్కడా కొన్ని ముఖ్య విషయములను టూకీగా వ్రాయమనుము. నేను సహాయం చేసెదను. వాడు నిమిత్తమాత్రుడే! నా జీవిత చరిత్ర నేను వ్రాసి నా భక్తుల కోరికలు నెరవేర్చవలెను..... నా కథలు, బోధలు విన్న భక్తులకు భక్తి విశ్వాసములు కుదురును. ఇవి బాబా మాటలు. అగ్రాహ్యమైన సద్గురు లీలలను ఎవ్వరు వర్ణించగలరు? ఆనందమనే అంతులేని సాగరాన్ని 'గురుకృప' పత్రిక రూపంలో అందించగలదా? అనుగ్రహం ఆకాశమంతయితే 'గురుకృప' పత్రిక ఆవగింజలో అణువంత! 'గురుకృప' - పత్రిక నిమిత్తమాత్రం, గురుదేవుల కృప నిత్యసత్యం. ప్రేమను పంచుకునే ప్రయత్నం చేస్తోంది గురుకృప..... ప్రేమను పంచుకుందాం..... ప్రేమను పెంచుకుందాం..... ఈ నవవసంతంలో నవ్యజీవనాన్ని సాగిస్తూ, సద్గురు స్మరణలో సదా తరిద్దాం.....**

**- గురుకృప**

